సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 20, మే, 2025



పేరుకే ఉచిత సేవలు

పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు నిబంధనల ప్రకారం అందాల్సిన సేవలు గాలిలో దీపంలా మారాయి. 8లో▸



హిందూ ధర్మ పరిరక్షణకు..

హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరు కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. 8లో▸



కడ్తాల్‌లో సినిమా షూటింగ్

సినిమా బృందం సభ్యులు కడ్తాల్‌లో సందడి చేశారు. ఓ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆమనగల్లులో ఇనుపయుగపు ఆనవాళ్లు



ఇనుపయుగపు ఆనవాళ్లను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో దాదాపు మూడు వేల ఏళ్ల నాటి ఇనుపయుగపు ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డా.ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారి పక్కన సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న సమాధులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో దాదాపు మూడు వేల ఏళ్లనాటి సమాధులు ఉన్నాయని, గతంలో వంద వరకు ఉండగా ప్రస్తుతం నాలుగు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం నాలుగు సమాధుల్లో మూడు ఆనవాళ్లు సరిగా లేనప్పటికీ ఒకటి మిగిలిఉందన్నారు. ఆయన వెంట స్థపతి భీమిరెడ్డి వెంకటరెడ్డి, శిల్పులు సాయికిరణ్‌రెడ్డి, తెలుగు ఎల్లయ్య ఉన్నారు.

గొప్ప పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పుచ్చలపల్లి సుందరయ్య గొప్ప పోరాటయోధుడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ డివిజన్ కార్యదర్శి శ్రీను నాయక్ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. సుందరయ్య నిరాడంబర జీవి అని, దేశానికి గొప్ప ఆదర్శ నాయకుడని అన్నారు. దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అని కొనియాడారు. పేదలకు భూమి కావాలని, వెట్టిచాకిరి నుంచి విముక్తి కలగాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి పదిలక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయించారని గుర్తు చేశారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా గ్రామాల్లో పోరాటం చేశారని, దళిత వాడల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, ఆంజనేయులుగౌడ్, కావలి రాజు, కుర్మయ్య, మహ్మద్ బాబుపాల్గొన్నారు.

బాటసింగారం భూములపై విచారణ జరపండి

- ఎక్స్ వేదికగా రెవెన్యూ అధికారులకు భువనగిరి ఎంపీ సూచన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న ప్రచారాలపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తన ఎక్స్ వేదిక ద్వారా కోరారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లు నిర్ధారణ జరిగితే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆమనగల్లువాసికి కీర్తిరత్న పురస్కారం



పురస్కారం అందుకున్న ఈశ్వరమ్మ

ఆమనగల్లు: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రముఖ కవి దాస ఈశ్వరమ్మను కీర్తిరత్న పురస్కారం వరించింది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన శ్రీగౌతమేశ్వర సాహితి కళాసేవా సంస్థ ఏటా సాహిత్య రంగంలో విశేష సేవలు అందించే వారికి పురస్కారాలు అందిస్తోంది. ఈ ఏడాది ఈశ్వరమ్మ అందించిన సాహిత్య సేవలకుగాను ఆమెను ఎంపిక చేశారు. మంథనిలో జరిగిన కార్యక్రమంలో ఈశ్వరమ్మకు శ్రీ గౌతమేశ్వరసాహితి కళాసేవా సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ కీర్తిరత్న పురస్కారం అందించారు. ఈశ్వరమ్మ రాసిన కవితలకు గాను సాహితీ సౌమిత్రి అనే బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు హైడ్రా చెక్

రెండు ప్రాంతాల్లో ఆపరేషన్స్

పుప్పాలగూడ, హైదర్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపు

- ఓ ప్రాంతంలో రోడ్లు, పార్కుల్లో ఉన్నవి కూల్చివేత
- మరోచోట 9 ఎకరాల హెచ్‌ఎండీఏ భూమి సంరక్షణ
- న్యాయస్థానం ఆదేశాల మేరకే చర్యలు: కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లోని ఆక్రమణలు తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయి విచారణ చేసిన అధికారులు ఆక్రమణలుగా తేల్చి కూకట్‌పల్లిలోని హైదర్‌నగర్‌లో ఉన్న డైమండ్ హిల్స్, మణికొండలోని పుప్పాలగూడలో ఉన్న డాలర్ హిల్స్‌ల్లో కూల్చివేతలు చేపట్టారు. హైడ్రా ఈ రెండు చోట్లా బోర్డులు ఏర్పాటు చేసింది.

కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ..

హైదర్‌నగర్ సర్వే నం.145లోని 9 ఎకరాల్లో డైమండ్ హిల్స్ పేరుతో లేఔట్ వేశారు. 79 ప్లాట్లతో కూడిన 2000 సంవత్సరం నాటి దీనికి హెచ్‌ఎండీఏ అనుమతి ఉంది. 2007లో అన్ రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ డీడ్‌తో డాక్టర్ ఎస్ఎస్‌డీ ప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమణలు మొదలెట్టారు. ప్లాట్ యజమానులు పార్టీ కాని కేసుల్లో ఎక్స్ పార్టీ డిక్రీ తీసుకుని బైలీఫ్ ద్వారా వ్యవసాయ భూమి అని చూపుతూ ఏడెకరాలు ఆక్రమించారు. ఆ కేసులో ప్లాట్ యజమానులను పార్టీ చేయకుండా కోర్టును తప్పుదోవ పట్టించి పొందిన బైలీఫ్ అర్డర్‌తో ఈ లే ఔట్‌లోని స్విమ్మింగ్‌పూల్, రహదారులు, పార్కులు, ప్లాట్లు హద్దులు, పునాదులను చెరిపేసి ఆక్రమించారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 9న హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ప్రసాద్ ఖాళీ చేయడం లేదని వాపోయారు. ఆ భూమిని వివిధ సంస్థలకు పార్కింగ్ కోసం అద్దెకు ఇస్తూ నెలకు రూ.50 లక్షలకు పైగా ఆర్జిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. లేఔట్‌లోని మిగతా రెండు ఎకరాల్లో ఉన్న ప్లాట్లకు వెళ్లడానికి వీలు లేకుండా ఫెన్సింగ్ కూడా వేశారని తెలిపారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న హైడ్రా కమిషనర్ గత బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆక్రమణలు నిర్ధారించి సోమవారం వాటిని తొలగించే చర్యలు తీసుకున్నారు.

డాలర్ హిల్స్‌లోనూ ఇదే తరహా కథ

పుప్పాలగూడలోని డాలర్ హిల్స్‌లోనూ ఆక్రమణల్ని హైడ్రా తొలగించింది. సర్వే నం. 104/1, 106, 113ల్లో సంతోష్‌రెడ్డి, ఆయన మిత్రులకు 60 ఎకరాల భూమి ఉంది. ఇందులోని 30 ఎకరాల్లో 1998లో డాలర్ హిల్స్ లే ఔట్ వేశారు. హెచ్‌ఎండీఏ ప్రిలిమినరీ లేఔట్‌తో మొత్తం 80 శాతం ప్లాట్లు అమ్మేశారు. ఆపై లేఔట్ రద్దయ్యేలా ప్రయత్నించి 2005లో చేయించారు. ఆపై స్థల యజమానులు కుమ్మక్కై వ్యవసాయ భూమిగా మార్చుకున్నారు. ఈ విషయం అప్పటికే ప్లాట్లు కొన్న వారికి తెలీదు. ఎల్ఆర్ఎస్‌తో అనుమతులు తీసుకుని కొందరు ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. సంతోష్‌రెడ్డి తదితరులు ఈ లేఔట్‌లోని రెండు ఎకరాల పార్కు, రహదారులతో పాటు కొన్ని ప్లాట్లను కలిపి పక్కనే ఉన్న 30 ఎకరాల భూమికి జోడించారు. దీన్ని ఎన్‌సీసీ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు అమ్మేశారు. 2016 నుంచి ఈ వివాదం కోర్టులో ఉన్నప్పటికీ అనుమతులు తీసుకోకుండా ఎన్‌సీసీ నిర్మాణాలు చేపడుతోందని నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా కమిషనర్ రంగనాథ్ ఈ నెల 14న క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా హైడ్రా సోమవారం అక్కడి నిర్మాణాలు తొలగించింది. అనుమతి లేకుండా సెల్లార్లు తవ్వడం, పేలుడు పదార్థాలను వినియోగించడాన్ని తీవ్రంగా పరిగణించింది. పార్కులు, రహదారులు ఆక్రమించిన కేసుల్లో ఇంప్లీడ్ అవ్వాలని హైడ్రా నిర్ణయించింది.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇందిరమ్మ ఇళ్ల గ్రౌడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియ, రాజీవ్ యువ వికాసం, తాగునీటి సరఫరాపై సంబంధిత అంశాలపై చర్చించారు. ఈనెల 25వ తేదీ వరకు గ్రౌండింగ్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేయాలని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. రాజీవ్ యువ వికాసంపై సమీక్షిస్తూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించిందన్నారు. మండలాలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యలు రాకుండా బాగా పని చేయడం జరిగిందని, రాబోయే 20 రోజుల వరకు ఇదే విధంగా పని చేయాలని సూచించారు. డీఆర్ఓ సంగీత, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు వెంకటరెడ్డి, అనంత్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి కేశురామ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, ఈఈ మిషన్ భగీరథ రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీలేని భవనాలను గుర్తించండి

పాతబస్తీ గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో సంబంధిత అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ఫైర్ సేఫ్టీలేని, ప్రమాదకరమైన లైన్లు, భవనాలను గుర్తించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లు గుర్తించి వాటిని వెంటనే తొలగించాలన్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం విద్యుత్, మున్సిపాలిటీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఫైర్‌సేఫ్టీ, విద్యుత్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ఫిర్యాదుదారులు అందించే దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం రెవెన్యూ శాఖకు సంబంధించి 24, ఇతర శాఖలకు సంబంధించి 29 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

కారులోకి దూసుకెళ్లిన క్రాష్ బారియర్

- ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే బెంగాల్‌వాసి మృతి
- గంటల తరబడి శ్రమించి మృతదేహం వెలికితీత



ప్రమాదంలో ధ్వంసమైన కారు



హిలాల్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. క్రాష్ బారియర్‌ను ఢీకొట్టడంతో కారులోకి పది మీటర్ల మేర దూసుకెళ్లిన ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. బెంగాల్ రాష్ట్రానికి చెందిన కితాబ్‌అలీ అలియాస్ హిలాల్ (35) ఘట్‌కేసర్ మండలం నాగారంలోని శిల్పానగర్, విశ్వసాయి బృందావనం అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. తుక్కుగూడ సమీపంలోని వివిధ కంపెనీలకు మ్యాన్‌పవర్ సప్లయ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే సోమవారం ఉదయం తుక్కుగూడకు వచ్చి తిరిగి నాగారం వైపు కారులో వెళ్తున్నాడు. బొంగ్లూర్ ఎగ్జిట్ 12 వద్దకు రాగానే అతివేగం అజాగ్రత్తగా వాహనం నడుపుతూ క్రాష్ బారియర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు అద్దంలో నుంచి క్రాష్ బారియర్ పది మీటర్ల వరకు దూసుకెళ్లింది. క్రాష్ బారియర్‌లోనే కారు ఉండిపోయింది. ప్రమాదంలో కితాబ్‌అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో క్రాష్‌బారియర్ ఇరుక్కుపోవడంతో మృతదేహం బయటకు తీయడం పోలీసులకు కష్టతరం అయ్యింది. ఔటర్‌రింగ్‌రోడ్డు సిబ్బందిని పిలిపించి కారు పైభాగం కట్ చేయించారు. గంటల తరబడి శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి బదిలీ



షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న రంగస్వామి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రంగస్వామి రెండేళ్లకు పైగా షాద్‌నగర్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీఎస్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీనారాయణ షాద్‌నగర్ ఏసీపీగా రానున్నారు.

గోడు వినండి.. గూడు కల్పించండి

దివ్యాంగ దంపతుల వేడుకోలు



ఇబ్రహీంపట్నం రూరల్: నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు వచ్చిన వీరు చంపాపేట్‌లో నివసించే రొండి నాగమ్మ, నాగేష్. దంపతులు ఇద్దరూ దివ్యాంగులే. పీజీ వరకు చదువుకున్నారు. వీరికి ఆరేళ్ల పాప ఉంది. ప్రస్తుతం పనులు చేయలేక ఇంట్లోనే ఉంటున్నారు. అద్దె ఇంట్లో కిరాయి సైతం చెల్లించకలేక ఇబ్బందులు పడుతున్నారు. నిరుపేదలమైన, దివ్యాంగులమైన తమకు ప్రభుత్వ పథకం కింద ఇల్లు కేటాయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేకమార్లు విన్నవించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆపసోపాలు పడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా రు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చారు. కలెక్టర్ కలవకపోవడంతో అధికారులకు అర్జీ సమర్పించారు. ఈ నెల 6న కూడా ప్రజావాణిలో మొరపెట్టుకున్నామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. నగరం నుంచి ఇంత దూరం రావాలంటే ఇబ్బందిగా ఉందని.. జీవనోపాధికరువై, బతుకుభారమై పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.తమ గోడు పట్టించుకుని ఉండటానికి ఎక్కడైనా కాస్త గూడు కల్పించి ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలం బలగం అన్నారు. బూత్ లెవల్ నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చిన మెజార్టీ స్థానాలు గెలుపొందడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నందు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్, బంట్వారం అధ్యక్షుడు మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఐటీఐని సందర్శించిన ఎంపీ

అనంతగిరి: వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాలను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో ఉన్న ట్రేడ్‌లు, కోర్సులు తదితర విషయాలపై ప్రిన్సిపాల్ నరేంద్రబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడ ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా రంగాల్లో ఉద్యోగాలు చేయడం గొప్ప విషయమన్నారు.

మారిస్తేనే మనుగడ

కేబుల్ లైఫ్ టైం 25 ఏళ్లలోపే!

- ఆ లోపే మార్చేయాలి.. లేదంటే ప్రమాదాలు తప్పవు
- లోడుకు తగ్గ వైరింగ్, ఎంసీబీలు, ప్రాపర్ ఎర్తింగ్‌తోనే రక్షణ
- 'సాక్షి'తో ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి కాంతారావు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'సాధారణంగా ఈ కేబుల్ జీవిత కాలం 25 ఏళ్లు మాత్రమే. ఆలోపే వాటిని మార్చేయాలి. ఐఎస్ఐ ప్రమాణాల మేరకే ఈ వైర్లను రూపొందించినప్పటికీ..వాటి సామర్థ్యానికి మించి లోడు కరెంట్‌ను వినియోగించడం, అంతర్గతంగా తలెత్తే వేడికి బయటి ఉష్ణోగ్రతలు తోడవడంతో ఆయా కేబుళ్లు తీవ్రమైన ఒత్తిడికి లోనైవుతుంటాయి. జాయింట్లు, లూజు కాంటాక్ట్‌ల వద్ద తరచూ స్పార్క్‌లు వెలుగు చూస్తుంటాయి. ఇటీవల వెలుగు చూస్తున్న మెజార్టీ విద్యుత్ ప్రమాదాలకు ఇదే ప్రధాన కారణం' అని ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ టి.కాంతారావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. గృహాలు, వాణిజ్య సముదాయాల్లో తరచూ వెలుగు చూస్తున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాటల్లోనే..

పాతవైర్లపైనే అదనపు లోడు

మెజార్టీ గృహాలు, వాణిజ్య సముదాయాల్లో 1.5 స్క్వైర్ ఎంఎం, 2.5 స్క్వైర్ ఎంఎం సామర్థ్యానికి మించిన కేబుళ్ల వాడటం లేదు. ఈ కేబుళ్ల జీవిత కాలం కూడా 25 ఏళ్లకు మించి ఉండదు. అంతేకాదు ఒకప్పుడు సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పది లైట్లు, నాలుగు ఫ్యాన్లు, ఒక టీవీ, కూలర్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, మిక్సీ, ఐరెన్ బాక్స్ మాత్రమే కన్పించేవి. తీరా ఆదాయం, ఇంటి అవసరాలు పెరిగిన తర్వాత వాటి సరసన ఏసీలు, గీజర్లు, వాషింగ్ మిషన్లు వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. ఆ మేరకు పాత లైన్లను తొలగించి, వాటి స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వైర్లను ఏర్పాటు చేయడం లేదు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాతలైన్లపై మరింత భారాన్ని మోపుతున్నారు. ఫలితంగా కేబుళ్లు ఒత్తిడికి గురై...షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. అంతేకాదు నిర్మాణ సమయంలో భవిష్యత్తు విద్యుత్ అవసరాలను అంచనా వేయలేకపోవడం వెరసి నిర్మాణ ఖర్చును తగ్గించుకునే క్రమంలో నాసిరకం విద్యుత్ వైర్లు, స్విచ్‌లు కొనుగోలు చేస్తుండటం కూడా ఈ ప్రమాదాలకు మరో కారణం. అంతేకాదు ఒకే సాకెట్ నుంచి మల్టీపుల్ ప్లగ్ కనెక్షన్లు ఇవ్వడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

ఒత్తిడితోనే కంప్రెసర్లలో పేలుళ్లు

ఇతర ఎలక్ట్రికల్ వస్తువులతో పోలిస్తే ఏసీ, గీజర్, వాషింగ్ మిషన్, ఓవెన్లకు విద్యుత్ లోడు ఎక్కువ అవసరం. సాధారణంగా మార్కెట్లో ఒకటి, ఒకటిన్నర, రెండు టన్నుల సామర్థ్యం ఏసీలు లభిస్తుంటాయి. ఏసీ సామర్థ్యాన్ని బట్టి కేబుళ్లను ఎంపిక చేసుకోవాలి. సాధారణంగా 1.5 టన్ను ఏసీకి 4 నుంచి 6 స్క్వైర్ ఎంఎంపైగా కేబుల్స్ వినియోగించాలి. కానీ మెజార్టీ భవనాల్లో 2.5 స్క్వైర్ ఎంఎం కేబుళ్లనే వాడుతున్నారు. పాత ఏసీల్లో ఇన్వర్టర్ మోడ్ సహా పవర్ సేవింగ్‌కు అవకాశం లేదు. ఇందు కోసం ఇన్వర్టర్ మోడ్ ఉన్న ఫైవ్ స్టార్, త్రీస్టార్ రేటింగ్ ఏసీలను ఎంపిక చేసుకోవాలి. ఏసీలను రోజంతా ఆన్‌లో ఉంచడం వల్ల కంప్రెసర్‌లో హీట్ జనరేట్ అవుతుంది. ఇన్వర్టర్ బ్యాటరీలను గాలి, వెలుతురు లేని ఇరుకైన ప్రదేశంలో ఏర్పాటు చేయడం వల్ల ఒత్తిడికి గురై.. షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. ఇన్వర్టర్ బ్యాటరీల్లో మూడు నెలలకోసారి డిస్టిలరీ వాటర్ నింపాలి. వీటి నిర్వహణ లోపంతో కూడా బ్యాటరీలు పేలుతుంటాయి. గుల్జార్‌హౌస్‌లో వెలుగు చూసిన ప్రమాదానికి ఇది మరో కారణం కూడా.

ప్రాపర్ ఎర్తింగ్‌తోనే ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ

మెజార్టీ భవనాల్లో ఎర్తింగ్ సిస్టం ఉండటం లేదు. ఒక వేళ ఉన్నా.. సరఫరాలో హెచ్చు తగ్గుల సమస్య వచ్చినప్పుడు పని చేయడం లేదు. వేసవిలో ఎర్తింగ్ పాయింట్లో తేమ శాతం తగ్గుతుంది. ప్రతి పదిరోజుకో సారి నీటిని పోయడం ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించొచ్చు. అంతేకాదు పోల్ నుంచి ఇంట్లోకి కరెంట్ సరఫరా చేసే సర్వీసు వైరు వెంట సాధారణంగా జీఏవైర్‌ను ఏర్పాటు చేస్తుంటాం. షార్ట్ సర్క్యూట్ కారణంగా పోల్‌పై ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు హై ఓల్టేజ్ విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా నియంత్రించేందుకు ఎగ్ ఇన్సులేటర్ వినియోగించాలి. విద్యుత్ లీకేజీలు లేకుండా చూసుకోవడం, ప్రతి ఇన్సు లేషన్‌కు ఎంసీబీలు, ఆర్సీసీబీలను ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా చూసుకోవచ్చు అని కాంతారావు స్పష్టం చేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి


ప్రత్యేక పూజలో ఎంపీ డీకే అరుణ తదితరులు

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో రామాలయం, శివాలయం ప్రారంభోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా బొడ్రాయి, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాల చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఎంపీ డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. అదేవిధంగా గ్రామ దేవతలను పూజించడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్, నాయకులు సుధాకర్‌రావు, వంశీకృష్ణ, మురళీ, వెంకటేష్, మోహన్‌సింగ్, శ్యాంసుందర్, బాల్‌రాజ్, శ్రీనివాస్, లష్కర్ నాయక్, రంగయ్యగౌడ్, రాజు, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హైసిటీ పనులకు నిధుల లేమి

- సర్కారు కరుణిస్తేనే ముందుకు
- లేకుంటే అంతే సంగతులు

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనుల కింద టెండర్లు పూర్తయినప్పటికీ, పనులు మొదలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే కేబీఆర్‌పార్కు చుట్టూ, ఖాజాగూడ, ట్రిపుల్‌ఐటీ జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర పనులకు సంబంధించి రూ. 1800 కోట్ల మేర పనులకు టెండర్లు పూర్తయ్యాయి. కేబీఆర్ చుట్టూ పనులకు కోర్టు వివాదాలతో ముందుకు సాగలేని పరిస్థితి నెలకొనగా, మిగతా ప్రాంతాల్లో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు భూసేకరణ పూర్తి కావాల్సి ఉంది. అందుకు అవసరమైన నిధులు జీహెచ్‌ఎంసీ ఖజానాలో లేవు. అవసరమైన నిధులను ప్రభుత్వం ఇస్తే తప్ప ముందుకు పోలేని పరిస్థితి. సదరు ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణలో భాగంగా ఆస్తులు కోల్పోయే నిర్వాసితులకు చెల్లించాల్సిన దాదాపు రూ. 760 కోట్లకు సంబంధించిన పరిహారం ఖరారు, తదితరాలతో అవార్డులు పాసైనప్పటికీ, భూమిని స్వాధీనం చేసుకునేందుకు చెల్లించేందుకు నిధుల్లేవు.జీహెచ్‌ఎంసీకి చెందిన పబ్లిక్ డిపాజిట్ ఖాతా లోని రూ.2వేల కోట్లు సైతం ప్రభుత్వం వినియోగించుకోవడంతో జీహెచ్‌ఎంసీకి వచ్చే ఆదాయం సిబ్బంది జీతాల చెల్లింపులకే కనాకష్టంగా మారనుంది. ప్రస్తుతానికి 'ఎర్లీబర్డ్' ద్వారా వచ్చిన నిధులతో ఇబ్బంది లేకపోయినప్పటికీ, మున్ముందు జీతాలకూ కటకటలాడాల్సిన పరిస్థితి తప్పదేమోనని జీహెచ్‌ఎంసీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల పనులు అడుగు ముందుకు పడని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో ఎస్సార్‌డీపీ(వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం) కింద పలు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు సైతం అప్పటి ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదు. కానీ, జీహెచ్‌ఎంసీ ఆర్థికపరిస్థితి, పరపతి దృష్ట్యా అప్పులు తెచ్చారు.

పేరుకే ఉచిత సేవలు

- పెట్రోలు బంకుల్లో కానరాని సౌకర్యాలు
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు

కొత్తూరు: జాతీయ రహదారితో పాటు చిన్న చిన్న పట్టణాల్లో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు నిబంధనల ప్రకారం అందాల్సిన సేవలు గాలిలో దీపంలా మారాయి. బిల్లులోనే ఆయా సేవల నిమిత్తం బంకుల నిర్వాహకులు కొంత మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఈ విషయం చాలా మంది వాహనదారులకు అవగాహన లేకపోవడంతో వాటిని వినియోగించుకోవడం లేదు. తరచూ పౌరసరఫరాల శాఖ అధికారులు బంకులను తనిఖీలు చేస్తున్నప్పటికీ లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆయా బంకుల నిర్వాహకులు సేవల నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో వందల సంఖ్యలో పెట్రోలు బంకులున్నాయి. నిత్యం లక్షల లీటర్ల డీజిల్, పెట్రోలు అమ్ముడవుతుంది. కానీ అంతంతమాత్రంగానే సౌకర్యాలున్నాయి.

ఇవన్నీ తప్పనిసరి

ప్రథమ చికిత్స కిట్: బంకుల్లో ప్రధానమైన సదుపాయం ప్రథమ చికిత్స కిట్. ఇందులో వైద్య పరికరాలు, ఔషధాలను ఎప్పటికప్పుడు మార్చడం తప్పనిసరి.

స్వచ్ఛమైన తాగునీరు: సుదూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు కొన్ని చోట్ల నీటి సౌకర్యం ఉండదు. ఇక ఎండాకాలం అయితే చెప్పనక్కర్లేదు. అందుకు బంకు యజమాని నాణ్యత కలిగిన ఆర్వో యంత్రం,


కొత్తూర్లులో పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న పెట్రోలు బంకు

నీటి సదుపాయం ఇస్తారు.

మరుగుదొడ్లు: బయట శౌచాలయాలు లేక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా అన్ని బంకుల్లో శుభ్రమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలి.

ఫోన్ సౌకర్యం: అత్యవసర సమయాల్లో ఫోన్ చేసుకునేందుకు సదుపాయం ఉంటుంది.

వాహనాలకు ఉచిత గాలి: వాహనాల టైర్లలో గాలి నింపడానికి, తనిఖీ చేసుకోవడానికి బంకుల్లో తప్పనిసరిగా సంబంధిత యంత్రం ఉండాలి. ఓ వ్యక్తి అందుబాటులో ఉండాలి. ఇది పూర్తిగా ఉచితం. నచ్చితే 'టిప్' ఇవ్వొచ్చు.

ఫిర్యాదుల పెట్టి: ఫిర్యాదుల పెట్టె అందుబాటులో ఉంటుంది. వినియోగదారుల ఫిర్యాదు, సలహాలు, సూచనలు రాసి అందులో వేయొచ్చు.

నాణ్యత ప్రమాణాల తనిఖీ: పెట్రోల్/డీజిల్ నాణ్యతపై అనుమానం కలిగితే అక్కడే తనిఖీ చేసుకోవచ్చు. ఇందుకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు కూడా బంకు వాళ్లే ఇవ్వాలి. దీనితోపాటు పెట్రోల్/డీజిల్ తక్కువగా వస్తుందని పించినా.. పరీక్షించుకోవచ్చు.

అగ్నిమాపక యంత్రం: బంకుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఆర్పేందుకు యంత్రాలు ఉండాలి.

ఫిర్యాదు ఎలా?

బంకుల్లో సదుపాయాలు ఏ ఒక్కటి లేకపోయినా, సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా వినియోగదారులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. చిరునామా, ఇతర సమాచారం ఇస్తే.. సంబంధిత చమురు సంస్థ వారిపై చర్యలు తీసుకుంటుంది.

- ఇండియన్ ఆయిల్: 1800233355
- భారత్ పెట్రోలియం: 1800224344
- హెచ్‌పీసీఎల్: 18002333555

సేవలను వినియోగించుకోవాలి



వాహనదారులు పెట్రోలు బంకుల్లో నిబంధనల మేరకు అందే సేవలపై అవగాహన పెంచుకోవాలి. మరుగుదొడ్లను వాడుకోవడం, తాగునీరు, టైర్లలో గాలి నింపేందుకు నిర్వాహకులు వినియోగదారుల బిల్లు నుంచే కొంతమొత్తంలో వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

కడ్తాల్‌లో సినిమా షూటింగ్


సందడిగా థియేటర్ ప్రాంగణం

కడ్తాల్: సినిమా బృందం సభ్యులు కడ్తాల్‌లో సందడి చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, రవిశంకర్ నిర్మాతలుగా, పి.మహేశ్ బాబు దర్శకత్వంలో హీరో రామ్ నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను సోమవారం మండల కేంద్రంలో చిత్రీకరించారు. స్థానిక శ్రీనివాస థియేటర్ ఆవరణలో దర్శకుడు మహేశ్‌బాబు పర్యవేక్షణలో నటీనటులపై చిత్రీకరణ చేశారు. కడ్తాల్‌లో సినిమా షూటింగ్ జరుగుతుండటంతో సినీ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు.

కూలీ డబ్బుల కోసం ఫోన్ చేసినందుకు..

ప్లంబర్‌ను చితకబాదిన కాంట్రాక్టర్

బంజారాహిల్స్: తనకు రావాల్సిన కూలీ డబ్బుల కోసం ఓ ప్లంబర్ తాను పని చేస్తున్న కాంట్రాక్టర్‌కు తరచూ ఫోన్ చేయడంతో ఆగ్రహం పట్టలేని కాంట్రాక్టర్ సదరు ప్లంబర్‌ను దారికాసి చితకబాదిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–13లోని శ్రీరామ్‌నగర్ బస్తీకి ఆశిష్‌కుమార్ దాల్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అతను జూబ్లీహిల్స్‌కు చెందిన అరుణ్‌కుమార్‌నాయక్ అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. ఈ నెల 17న తనకు రెండు రోజుల భత్యం రావాలంటూ పలుమార్లు అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన అరుణ్‌కుమార్ బైక్‌పై వెళుతున్న ఆశిష్‌కుమార్‌ను అడ్డగించి తనకు అన్నిసార్లు ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో బాధితుడి ఎడమ చేయి వేలు విరిగిపోయింది. బాధితుడి పిర్యాదు మేరకు పోలీసులు అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ నోట్ల మార్పిడీకి యత్నం

నిందితుడి రిమాండ్


కుంజురామ్ ఇచ్చిన నకిలీ నోటు

కుత్బుల్లాపూర్: నకిలీ నోట్లు అంటగట్టి ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిరిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన మనీషా సావంత్ తనకు పరిచయస్తుడైన చత్తీస్‌ఘడ్ ప్రాంతానికి చెందిన కుంజురామ్ పటేల్‌కు రూ.18.5 లక్షలు ఆన్‌లైన్‌లో బదిలీ చేసింది. మనీషాకు ఇవ్వాల్సిన డబ్బులు నగదు రూపంలో ఇస్తానని, పేట్‌బషీరాబాద్‌లోని పాంటలూన్స్ షోరూమ్ వద్దకు రమ్మని చెప్పాడు. కుంజురామ్ ఆమెకు నకిలీ నోట్లు అంటగట్టేందుకు యత్నిస్తుండగా గుర్తించిన మనీషా అతడిని నిలదీసింది. దీంతో కుంజురామ్ అతని అనుచరులు అక్కడి నుంచి పరారయ్యారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు కుంజురామ్, అతడి అనుచరులను అదుపులోకి తీసుకుని సోమవారం మేడ్చల్ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


బన్సీలాల్ (ఫైల్)

కందుకూరు: ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో నివసిస్తున్న పాతలావత్ బన్సీలాల్(50) అనే వ్యక్తి ఈ నెల 17న తెల్లవారుజామున 4 గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అంతటా వెతికిన కుటుంబీకులు ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందిగామ: కిరాణ వస్తువుల కోసం దుకాణానికి వెళ్లి తిరిగి వస్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తాటిగడ్డతండా సమీపంలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఇన్నర్ డియోసింగ్(51) తన కుటుంబంతో వలస వచ్చి చాకలిదానిగుట్ట తండా సమీపంలో స్థిరపడ్డాడు. ఆయన ఆదివారం రాత్రి కిరాణా సరుకుల కోసం సమీపంలోని షాపునకు వెళ్లి వస్తుండగా కొత్తూరు నుంచి రంగాపూర్ వైపునకు అతివేగంగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలవ్వడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు మృతుడి కుమారుడు బాసన్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మల్కాజిగిరి: విద్యుదాఘాతంతో భార్య మృతి చెందగా.. భర్త తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సునీల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా మెట్టుపల్లికి చెందిన కె.రవి, కవిత(30) దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి బతువుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మల్కాజిగిరి ఇందిరా నెహ్రూనగర్‌లో ఉంటూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ నెల 18న వారు బాలరాజ్ అనే వ్యక్తికి చెందిన ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్నారు. రెండో అంతస్తు నుంచి ఇనుప కడ్డీలు కిందికి దించుతుండగా కడ్డీలు విద్యుత్ తీగలడంతో రవి విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్తను రక్షించేందుకు వెళ్లిన కవిత కూడా ప్రమాదానికి గురైంది. స్థానికులు వారిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పతికి తీసుకెళ్లాలని సూచించారు. కవితను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. రవిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భవన యజమాని, మేస్త్రీ నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె చనిపోగా, అల్లుడు గాయాల పాలయ్యాడని కవిత తల్లి దావ్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచి మాటలు చెప్పినందుకు...

- సమీప బంధువు దారుణ హత్య
- నడి రోడ్డుపై ఘాతుకం


మోతీలాల్(ఫైల్)

మేడ్చల్: మద్యానికి బానిసై సంసారాన్ని ఎందుకు చెడగొట్టుకుంటున్నావ్ మంచిగా ఉంటూ భార్యా పిల్లలను బాగా చూసుకో అంటూ నాలుగు మంచి మాటలు చెప్పినందుకు ఓ వ్యక్తి తన బావ వరుసైన వ్యక్తిని నడిరోడ్డుపై కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన స్థానిక సరస్వతీనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుజరాత్‌కు చెందిన సోలంకి మోతీలాల్(43), అతడి మేనత్త కుమారుడు శంకర్(35) కుటుంబాలతో కలిసి రైల్వే స్టేషన్ సమీపంలోని సరస్వతీ నగర్‌లో ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. కాగా మద్యానికి బానిసైన శంకర్ కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కూడా మద్యం తాగి వచ్చిన అతను కుటుంబ సభ్యులతో గొడవ పడి సమీపంలోని రైల్వే ప్లాట్ ఫారంపై పడుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మోతీలాల్ అక్కడికి వెళ్లి శంకర్‌కు నచ్చజెప్పేందుకు యత్నించాడు. అయితే మద్యం మత్తులో ఉన్న శంకర్ అతడిని


రోదిస్తున్న మృతుడి కుటుంభసభ్యులు

దుర్భాషలాడాడు. అనవసరంగా భార్యా పిల్లలతో గొడవలు ఎందుకని అతడికి సర్దిచెప్పిన మోతీలాల్ శంకర్‌ను ఇంట్లో దిగబెట్టి తన ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లేందుకు సిద్ధమైన మోతీలాల్ తన బంధువుల ఇంటి వద్దకు వెళుతుండగా అతడిని అడ్డుకున్న శంకర్ తన కుటుంబ విషయాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నావంటూ అతడిని తిడుతూ దాడి చేసేందుకు వెళ్లాడు. దీంతో మోతీలాల్ ఈ విషయాన్ని శంకర్ తల్లికి చెప్పేందుకు వెళుతుండగా ఆగ్రహానికి లోనైన శంకర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో మోతీలాల్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడే కుప్పకూలడంతో శంకర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబసభ్యులు మోతీలాల్‌ను 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

వేలు కొరికేశాడు..

వెంగళరావునగర్: ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇద్దరు మహిళలపై దాడి చేయడమే కాకుండా ఓ మహిళ వేలును సైతం కొరికేసి సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుజిత అనే మహిళ జవహర్‌నగర్‌లో నివాసం ఉంటోంది. మూడేళ్ల క్రితం ఆమె ఇంట్లో అద్దెకు వచ్చిన మమత అనే మహిళ చిట్టీల వ్యాపారం చేసేది. ఆమె భర్త హేమంత్ అందుకు సహకరించేవాడు. అయితే మమతకు ఇంటి ఓనర్ కుమార్తె సుజిత చిట్టీల డబ్బుల విషయమై రూ.30 వేలు బాకీ ఉంది. ఈ విషయమై ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో మమత ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. గత ఆదివారం బాకీ డబ్బులు అడిగేందుకు మమత తన భర్తతో కలిసి సుజిత ఇంటికి వచ్చింది. వచ్చీ రావడంతోనే వారు సుజితతో గొడవ పెట్టుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న హేమంత్ సజితపై దాడి చేశాడు. ఈ విషయం తెలియడంతో సుజిత తల్లి లత అక్కడికి వచ్చి వారిని వారించే ప్రయత్నం చేసింది. అయితే భార్యాభర్తలు ఆమెను పక్కకు లాగేశారు. హేమంత్ లత చూపుడు వేలును కొరకడంతో వేలు తెగి కిందపడింది. బాధితురాలు వేలు తీసుకుని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా అతికించడం కుదరదని తేల్చిచెప్పారు.

రోడ్డు దాటాలంటే.. దడ

విజయవాడ రహదారిపై కనిపించని వేగనియంత్రణ

- దూసుకెళ్తున్న వాహనాలు
- జంకుతున్న పాదచారులు

హస్తినాపురం: విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించి పాదచారులు రోడ్డు దాటాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విజయవాడ జాతీయ రహదారిపై చింతల్‌కుంట చెక్‌పోస్టు నుంచి మొదలుకొని పనామా చౌరస్తా, సుష్మాచౌరస్తా ఆటోనగర్, హైకోర్టుకాలనీ, భాగ్యలతకాలనీ, హయత్‌నగర్ డిపో, హయత్‌నగర్‌లో రోడ్డుపై రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో రోడ్డు దాటాలంటేనే కనీసం 10–20 నిమిషాల సమయం పడుతోంది.

ఎఫ్ఓబీలు నిర్మిస్తేనే..

విజయవాడ రహదారిపై నిత్యం రద్దీగా ఉండే వనస్థలిపురం, పనామాచౌరస్తా, చింతల్‌కుంట,ఆటోనగర్,హయత్‌నగర్, తదితర ప్రాంతాలలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలను నిర్మిస్తేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని పాదచారులు కోరుతున్నారు. ఆటోనగర్, హైకోర్టు కాలనీ,హయత్‌నగర్,వనస్థలిపురం,చింతల్‌కుంట తదితర ప్రాంతాల్లో విజయవాడ జాతీయ


వనస్థలిపురం జాతీయ రహదారి



వనస్థలిపురం పనామా చౌరస్తా మలుపు వద్ద వాహనాల రద్దీ

రహదారికి ఆనుకుని ఉన్న కాలనీలకు బస్సు దిగి వెళ్లాలంటేనే ప్రజలు వాహనాల రద్దీని చూసి బెంబేలెత్తుతున్నారు. రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నప్పటికీ ఈ రోడ్డును ప్రజలు ఏ విధంగా దాటుతారన్న విషయం అధికారులకు అర్థం కాకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విజయవాడ రహదారిపై రోడ్డు దాటుతున్న సమయంలో చాలా ప్రాంతాల్లో ప్రమాదాల జరుగుతున్నాయని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..



విజయవాడ జాతీయ రహదారిపై వేగనియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు పేర్కొన్నారు. పాదచారుల సౌకర్యార్థం విజయవాడ జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో ఎఫ్ఓబీలు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ, జాతీయ రహదారుల సంస్థకు లేఖలు రాశామని హయత్‌నగర్ వర్ధ్‌అండ్‌డీడ్ దగ్గర ఫుట్ ఓవర్‌బ్రిడ్జి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. హయత్‌నగర్‌లోని భాగ్యలతకాలనీ దగ్గర కూడా ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని పలు కారణాలతో పనులు జరగడం లేదన్నారు. పాదచారులు రోడ్డు దాటేలా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు.